రైతే దేశానికి భరోసా
వ్యవసాయమే భవిష్యత్తు భరోసా

రైతు బలం... దేశం బలం

తెలుగు రాష్ట్రాల
రైతన్నల కోసం...
రైతన్నల గొంతుక

• సంపుట : 01
• సంచిక : 01
• తేదీ : 07-08-2026
: గురువారం
• పేజీలు : 08

# ఆదిప్రేత

వ్యవసాయ ప్రత్రిక
( టీ మీడియా అనుబంధం )



వ్యవసాయ సమాచారం | పంటల సమాచారం | వాతావరణ సమాచారం | ప్రభుత్వ పథకాలు | పశుపోషకులకు | మార్కెట్ ధరలు

Published From : Hyderabad, Telangana
www.tmedia.in | info@tmedia.in

రైతు సంక్షేమం | వ్యవసాయం అభివృద్ధి | గ్రామీణ ప్రగతి | ఆహార భద్రత | సమృద్ధి భారత్

Follow Us :

T MEDIA

## ఎండిపోతున్న నారుమడులు ఇంకా పడని నాట్లు

### – దివిసీమ రైతులను వెంటాడుతోన్న ఎల్‌నినో ప్రభావం

ఎల్‌నినో ప్రభావం దివిసీమ రైతులను వెంటాడుతోంది. అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లో ఒక్క ఎకరంలో కూడా నాట్లు పడలేదని రైతులు చెబుతున్నారు. మిబ్బటిరీ కొలు చెల్లించి నారుమడులు వేశామని తెలిపారు. నారుమడులు ఎండిపోతున్నాయని నాట్లుకు వేసుకోటానికి నీరివ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఆగస్టు మొదలైన నాట్లు వేయని పరిస్థితి :** ఎల్‌నినో ప్రభావంతో కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలో తీవ్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. దివిసీమ పరిధిలోని అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లో సుమారు 80 వేల ఎకరాల్లో ప్రతి సంవత్సరం వరి సాగుచేస్తారు. రెండో పంటగా మినుము వేస్తారు. ప్రతి సంవత్సరం ఆగస్టు మొదలయ్యే నాటికి వరినాట్లు వేస్తారు. ఈసారి అటు కాలువ ద్వారా నీరు రాక ఇటు వర్షాలు పడక ఇప్పటికీ నాట్లు వేయని పరిస్థితి నెలకొంది.

**50 క్యూసెక్కులే నీరు కూడా రాని పరిస్థితి :** జులై 10న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించి పులిగడ్డ అక్విడక్ట్ మీదుగా దివిసీమలోకి సాగునీటిని విడుదల చేశారు. కాలువల పక్కన ఉన్న రైతులు ఆయిల్ ఇంజిన్లతో నీరు తోడుకుని నారుమడులు పోసుకున్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా ఈస్ట్ బ్యాంక్ కాలువకు 700 క్యూసెక్కుల నీరు విడుదల చేసినా వాటిలో 50 క్యూసెక్కుల నీరు కూడా దివిసీమలోకి రావడం లేదని రైతులు వాపోతున్నారు. చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల్లో 90 శాతం వరకు నాట్లు పూర్తి అయ్యాయని తమకు మాత్రమే నీరు రావడం లేదని అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు తక్షణమే స్పందించి తమకు కాలువ నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**బతుకుదెరువు కోసం వలస పోతున్న రైతులు :** దివిసీమ ప్రాంతంలో ఖరీఫ్‌లో వరి పంట సాగుకు మాత్రమే అనుకూలమని రైతులు తెలిపారు. మరోపంట వేసుకోవడానికి అవకాశం లేదన్నారు. వరి నాట్లు వేయకపోవడంతో పనులు లేక కూలీల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. పనుల కోసం బయట ప్రాంతాలకు వలస వెళ్తున్నారని తెలిపారు.



## చింతచిగురు సాగుతో ఆశ్చర్యపరిచున్న రైతు..

### ఏడాది అంతా ఆదాయం..



సాధారణంగా ఎండాకాలంలోనే ఎక్కువగా దొరికే చింతచిగురును ఏడాది పొడవునా పండిస్తూ, కిలోకు రూ.1,000 వరకు విక్రయించి లాభాలు ఆర్జిస్తున్న రైతు గురించి ఎప్పుడైనా విన్నారా? సంప్రదాయ పంటలకు భిన్నంగా ఆలోచించి, మార్కెట్ డిమాండ్‌ను ముందుగానే అంచనా వేసి వ్యవసాయాన్ని బంగారు బాటగా మార్చుకున్నాడు కృష్ణా జిల్లా రైతు పర్వతనేని శ్రీనివాసరావు.

- కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ఈడుపుగల్లు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు, అందరిలా సంప్రదాయ పంటలపై ఆధారపడకుండా మార్కెట్‌లో ఉన్న అవకాశాలను గుర్తించారు. అనంతపురం పరిశోధన కేంద్రం అభివృద్ధి చేసిన 'అనంత రుద్ర', 'తెట్టుమాలిగ' హైబ్రిడ్ రకాలుతో నాలుగు ఎకరాల్లో ప్రత్యేక చింత తోటను ఏర్పాటు చేశారు.

- ఈ తోట ప్రత్యేకత ఏమిటంటే.. చెట్లను కేవలం 4 నుంచి 5 అడుగుల ఎత్తులోనే ఉంచుతూ నిరంతరం కత్తిరింపులు చేస్తారు. పాత ఆకులను తొలగించడం వల్ల కొత్త చిగురు నిరంతరం వస్తుంది ట్రదటంతో ఏడాది పొడవునా తాజా చింతచిగురు లభిస్తోంది. మొదటి ఐదేళ్లు ఆదాయం లేకపోయినా ఓర్పుతో సాగు కొనసాగించిన శ్రీనివాసరావు, ఇప్పుడు దాదాపు ప్రతిరోజూ ఆదాయం ఆర్జిస్తున్నారు.

## పొలాలకు పచ్చందాలు

### – తెలంగాణలో పుంజుకున్న వరి సాగు



: తెలంగాణలో వర్షాకాలంలో ప్రధాన పంట అయిన వరి సాగు క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుత వానకాల సీజన్‌లో ఈ పంట సాగు విస్తీర్ణం భారీగా పెరుగుతోంది. వ్యవసాయ శాఖ ప్రారంభంలో కరువు పరిస్థితుల అంచనాలతో సాగు తగ్గుతుందని భావించినప్పటికీ, ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రైతులు పెద్ద ఎత్తున వరి నాట్లు వేస్తున్నారు. బుధవారం నాటికి వరి సాగు 44.47 శాతానికి చేరుకుంది. గత ఏడాది ఇదే సమయానికి సాగు విస్తీర్ణం 29,22,348 ఎకరాలు ఉండగా, ప్రస్తుతం అది 29,32,884 ఎకరాలకు పెరిగిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది.

**పంటల వారిగా సాగు**

| పంట | లక్ష్యం (ఎకరాల్లో) | సాగు | శాతం |
|---|---|---|---|
| వరి | 65,95,645 | 29,32,884 | 44.47 |
| పత్తి | 47,41,541 | 46,89,258 | 98.90 |
| మొక్కజొన్న | 6,16,787 | 5,01,508 | 81.31 |
| కందులు | 5,44,681 | 4,68,975 | 86.10 |
| సోయాబీన్ | 4,16,656 | 3,68,797 | 88.51 |
| చెరకు | 55,739 | 37,790 | 67.80 |
| మినుములు | 36,816 | 18,531 | 50.33 |
| జొన్నలు | 34,567 | 23,800 | 68.85 |
| వేరుశనగ | 25,875 | 3,521 | 13.61 |

### ప్రాజెక్టులు నిండటంతో రైతుల్లో ఆశలు

రుతుపవనాలు పుంజుకుని వర్షాలు పడటంతో మొన్నటివరకు వెలవెలబోయిన ప్రాజెక్టులు ప్రస్తుతం జలకళను సంతరించుకుంటున్నాయి. దీనితో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో సాగుపై దిగులు చెందిన రైతన్నలు, ప్రస్తుతం పంట పనులు వేగవంతం చేస్తున్నారు. కృష్ణా, గోదావరి నదులపై ఉన్న జలాశయాల్లో నీటి నిల్వలు 40 శాతాన్ని దాటాయి. 87 జలాశయాల్లో పూర్తి సామర్థ్యమైన 1059 టీఎంసీలకు గాను, ప్రస్తుతం 40.89% మేర 433.15 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గోదావరి బేసిన్ జలాశయాల్లో 142 టీఎంసీలు, కృష్ణా బేసిన్ జలాశయాల్లో 290 టీఎంసీలకు పైగా నీరు ఉంది.

**వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి**

- జూన్‌లో సాధారణ వర్షపాతం 130.30 మి.మీ కాగా, 115 మి.మీ నమోదైంది.
- జులైలో సాధారణ వర్షపాతం 227.40 మి.మీ కాగా, 222.90 మి.మీ నమోదైంది.
- ఈ నెలలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 38.4 మి.మీ కాగా, 39.1 మి.మీ వర్షపాతం నమోదైంది.

**లోటు వర్షపాతం జిల్లాలు**
జనగామ, హనుమకొండ, వరంగల్, హైదరాబాద్, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం

**అధిక వర్షపాతం జిల్లాలు**
రంగారెడ్డి, మెదక్, కామారెడ్డిలలో అధిక వర్షపాతం నమోదు

**సాధారణ వర్షపాతం జిల్లాలు**
మిగిలిన జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.